APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 02 సెప్టెంబర్ 2026 సంపుటి: 01 సంచిక :98 పేజీలు : 04 వెల: 2-00/-

## సామాజిక భద్రతలో ఆంధ్రా నం.1.. పెన్షన్లకు రూ.73,594 కోట్ల ఖర్చు



సామాజిక భద్రత అంశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా నిలుస్తోందని మాజీ మంత్రి దేవినేని ఉమా సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమం, జల భద్రత వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందని ప్రశంసించారు.

అమరావతి, సెప్టెంబరు 01: సామాజిక భద్రత అంశంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం 21 రకాల పింఛన్లకు రూ.73,594 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలోని గొల్లపూడిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కూటమి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. అభివృద్ధి, సంక్షేమం, జల భద్రత.. మిగతా..2లో

## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట



శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్

సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్

విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

ఢిల్లీ : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. మిగతా..2లో

## ప్రపంచం తడబడుతున్నా.. భారత్ దూసుకెళ్తోంది




2

- తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ 7.8% వృద్ధి
- వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనమన్న పవన్
- ప్రపంచ అనిశ్చితిపై భారత్ స్థైర్యం చాటిందని వెల్లడి
- మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన పవన్ కల్యాణ్
- డిజిటల్ రంగం, మౌలిక వసతుల్లో పురోగతి ఉందని వ్యాఖ్య

అమరావతి : భారత్ జీడీపీ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ ఆర్థిక స్థైర్యం, విశ్వాసానికి నిదర్శనమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగుతున్నా భారత్

# బటన్ నొక్కడానికి రాలేదు పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి
- రెండేళ్లలో పింఛన్లకే రూ.73,500 కోట్లు, సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు
- ఆడబిడ్డలకు త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం
- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి



అమరావతి : నేను కేవలం పింఛన్లు ఇవ్వడానికి, బటన్ నొక్కడానికి ఇక్కడికి రాలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదలకు భరోసా కల్పించి, వారిలో ధైర్యం నింపేందుకే వచ్చానని ఉద్ఘాటించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సరిగ్గా 31 ఏళ్ల కిందట ఇదే రోజున తాను మొదటిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మిగతా..2లో

## వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి



- నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామన్న నారాయణ
- ఓటమి భయంతోనే వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఎద్దేవా
- అభ్యర్థులు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో వైసీపీ ఉందని వ్యాఖ్య

అమరావతి : వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టుల్లో కేసులు వేసినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిబం ధనలు, న్యాయస్థానం ఆదే శాలకు అను గుణంగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయాలు తీసుకు ంటామని మిగతా..2లో

## ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు భారీ ఊరట.. ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్ హైకోర్టు ఆదేశం



2

- జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలని ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశం
- వీరిని కుటుంబ సభ్యులు కలిసేందుకు అమతించాలన్న హైకోర్టు
- కుమారులతో ఫోన్లో ఇమ్రాన్ మాట్లాడేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశం

ఢిల్లీ : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు ఇస్లామాబాద్ హైకోర్టు

## ఎకానమీపై మోదీ చేస్తున్న ప్రచారం 'లెట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉంది'

- భారత ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే
- దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరిందని ఆరోపణ
- 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని విమర్శలు



ఢిల్లీ : ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. జీడీపీ వృద్ధిని ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను షేర్ చేయడంపై దుయ్యబట్టారు. మోదీ ఆర్థిక వ్యవస్థపై చేస్తున్న ప్రచారం కేవలం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉందని విమర్శించారు. సామాన్య ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరిందని, 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## బయటపడిన పాక్ వక్రబుద్ధి.. మోదీ ఫొటోను క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు..

- పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని బయటపెట్టుకుంది.
- షాంఘై సహకార సంస్థ సదస్సు వేదికగా సభ్య దేశాల అధినేతలు దిగిన ఫొటోను పాక్ క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వివాదం చెలరేగింది.



న్యూఢిల్లీ: అంతర్జాతీయ సదస్సు వేదికగా పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని బయటపెట్టుకుంది. షాంఘై సహకార సంస్థ (రాజా) సదస్సు సందర్భంగా సభ్య దేశాల అధినేతలు దిగిన ఫొటోను పాక్ క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వివాదం చెలరేగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కనిపించకుండా కట్ చేసిన ఫొటోను పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం పోస్టు చేయడం కలకలం రేపింది. అలాగే ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను హైలైట్ చేస్తూ ఫొటో మధ్యలో కనిపించేలా మిగతా..2లో

## అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ



2

- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే.

# హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 1 : హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్(ఆ) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను మిగతా..2లో

## ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలి



- సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
- మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 1: సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని.. మిగతా..2లో

అనంత సూర్య
తెలుగువార్త
బుధవారం 02 సెప్టెంబర్ 2026

మొదటి పేజి తరువాయి

## ప్రపంచం తడబడుతున్నా.. భారత్ దూసుకెళ్తోంది: పవన్ కల్యాణ్

తన బలాన్ని చాటుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, దేశ ప్రజల సమష్టి శక్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశం ముందుకు సాగుతోందన్నారు. 2014 నుంచి భారత్ ఆర్థికంగా మరింత బలపడిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, డిజిటల్ రంగం, మౌలిక వసతుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. యువత పెద్ద కలలు కనడంతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాలు, సాంకేతిక రంగంలో ముందుకు సాగేందుకు అవకాశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా భారత్ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ వేదికపై దేశానికి విశ్వసనీయత, ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దేశంగా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.

## వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి

ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఇప్పటికే రూ. 3,300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి తట్టుకోలేక ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేని దయనీయ స్థితిలో ఆ పార్టీ ఉందన్న ఆయన... అందుకే రాష్ట్రంలో ఎక్కడా ఎన్నికలు ఏకగ్రీవం కాకూడదని జగన్ తన నేతలకు హుకుం జారీ చేశారని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టుల క్రెడిట్ తమదేనని వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తోందని వివరించారు. నెల్లూరు నగరంలో కాలువల కట్టలపై ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసే అంశంపై త్వరలోనే ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలి

ఉత్సవాల ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, చేనేత కండువాలు వాడాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితిని కోరామన్నారు. మట్టి వినాయకులను వాడి... పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల సమయంలో మంచి వర్షాలు కురవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల్లో ఎల్‌నినో కష్టాల నుంచి గట్టెక్కించి.. మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు. కోర్టులను గౌరవిస్తూనే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బయటపడిన పాక్ వక్రబుద్ధి.. మోదీ ఫొటోను క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు..




ఎడిట్ చేయడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో మంగళవారం జరిగిన ఎస్‌సీవో సదస్సులో 10 సభ్య దేశాల నేతలు కలిసి ఫొటో దిగారు. అయితే పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం విడుదల చేసిన చిత్రంలో మోదీతో పాటు ఇరాన్ అధ్యక్షుడు, మరికొందరు నేతలు కనిపించలేదు. ఫొటోను అలా కట్ చేయడం ద్వారా షెహబాజ్ షరీఫ్‌ను గ్రూప్‌లో మధ్యలో ఉన్నట్టుగా చూపించే ప్రయత్నం చేసినట్లు స్పష్టమైంది. వాస్తవానికి పూర్తి ఫొటోలో షెహబాజ్ షరీఫ్ కుడివైపు నుంచి నాలుగో స్థానంలో ఉన్నారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసిన అసలు ఫొటో స్పష్టం చేసింది. అందులో ఎస్‌సీవో నేతలందరితో పాటు షెహబాజ్ షరీఫ్ కూడా స్పష్టంగా కనిపించారు. దీంతో పాకిస్థాన్ చేసిన ఎడిటింగ్ సోషల్ మీడియాలో బయటపడింది. మరోవైపు, షెహబాజ్ షరీఫ్ అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేసిన ఎస్‌సీవో నేతల రౌండ్‌టేబుల్ వీడియోలోనూ మోదీ కనిపించకుండా క్రాప్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు పాకిస్థాన్ చర్యలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. పూర్తి గ్రూప్ ఫొటోలను షేర్ చేస్తూ పాకిస్థాన్ తీరును ఎండగట్టారు. కొందరు నెటిజన్లు షెహబాజ్ షరీఫ్ చేతిలో భిక్షాటన పాత్ర ఉన్నట్లుగా ఫొటోలను ఎడిట్ చేసి మరీ పోస్టు చేశారు. గతంలో తాను ఆర్థిక సాయం కోసం ప్రపంచ దేశాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఈ పోస్టులు చేశారు. అలాగే, పాకిస్థాన్ పీఎంవో ఫొటోను ఇలా కట్ చేయడాన్ని 'చిన్నపిల్లల సోషల్ మీడియా ట్రిక్' అంటూ పలువురు విమర్శించారు.

## సామాజిక భద్రతలో ఆంధ్రా నం.1.. పెన్షన్లకు రూ.73,594 కోట్ల ఖర్చు

మొదటి పేజి తరువాయి

ఈ మూడు అంశాలకూ సీఎం చంద్రబాబు నాయుడు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం, వెలిగొండ ప్రాజెక్టులతో రాష్ట్రానికి జల భద్రతనిచ్చామని దేవినేని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నా సమగ్ర నిర్వహణతో అన్ని ప్రాంతాలకూ నీటిని అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టితోనే రాష్ట్రంలో నీటి వనరుల సమగ్ర నిర్వహణ సాధ్యమవుతోందని వివరించారు. ఏలేరు రిజర్వాయర్‌కు పునరుజ్జీవం పోసి.. పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖకు తాగునీరు పిఠాపురం, పాయకరావుపేట ప్రాంతాలకు గోదావరి జలాలు అందిస్తామని భరోసా కల్పించారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు




సంక్షేమాన్నీ కూటమి ప్రభుత్వం సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని టీడీపీ సీనియర్ నేత అన్నారు. 8 మంది పిల్లలు ఉన్న కుటుంబానికి కూడా 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తోందన్నారు. ఇదే సమయంలో వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో 10 లక్షల మంది అర్హుల పింఛన్లను తొలగించారని ఆరోపించారు. పెన్షన్ సొమ్మును రూ.1,000 పెంచేందుకు ఐదేళ్ల కాలయాపన చేశారని, దీంతో ఒక్కో లబ్ధిదారుడికి రూ.28 వేల నష్టం వాటిల్లిందని విమర్శించారు. ఐదేళ్ల అధికారంలో ఉండి అభివృద్ధిని అడ్డుకున్న వైసీపీ ఇప్పుడు క్రెడిట్ చోరీ డ్రామాలాడుతోందని ఫైరయ్యారు. ఒక్కో ప్రాంతంలో ఒక మాట మాట్లాడుతూ ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు సూచించారు.

## బటన్ నొక్కడానికి రాలేదు – పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంపై కీలక ప్రసంగం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛన్లు అందిస్తున్నామని సీఎం తెలిపారు. గడచిన రెండేళ్లలో పెన్షన్ల కోసమే రూ.73,500 కోట్లు వెచ్చించామని వివరించారు. అలాగే, మొత్తం సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా వారికి ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. సంక్షేమం అనేది పేదవాడిని నిలబెట్టేలా ఉండాలని సూచించారు.మహిళా సాధికారత : ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడకూడదని ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో 'దీపం' పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 33 శాతం రిజర్వేషన్లు తెచ్చామన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తానే తీసుకువచ్చానని, త్వరలో మహిళా డ్రైవర్లను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. నరసాపురంలో దేశంలోనే నంబర్ వన్ ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నిన్ననే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించానని, దానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తున్నామని, కొండలు, గుట్టలు తొలిచి మరీ నీటిని తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఏమాత్రం రావని భరోసా ఇచ్చారు. తలసరి ఆదాయం పెంపు : ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ.3 లక్షలుగా ఉందని, 2047 నాటికి దానిని రూ.54 లక్షలకు చేర్చడమే లక్ష్యమని సీఎం వివరించారు. తలసరి ఆదాయం పెరిగితే ఆటోమేటిక్ గా పేదల సంపద వృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఆ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకులు కేవలం బటన్లు నొక్కి రోడ్లకు గుంతలు పెట్టారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్సీపీ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. తాము ఏ మంచి పని చేసినా వైఎస్సార్సీపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ లో భాగంగా మెగా డీఎస్సీ వేస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కోర్టులో ఏకంగా 350 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్



టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, మీ పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో అవసరం లేదని తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తపన, అనుభవంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో దూసుకెళ్తోందని సీఎం అన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేనని, ఎంత సేవ చేసినా రుణం తీర్చుకోలేనని భావోద్వేగానికి గురయ్యారు. 45 ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు టీడీపీకి అండగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే ప్రజలు తమ సలహాలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

## ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు భారీ ఊరట.. ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్ హైకోర్టు ఆదేశం

మొదటి పేజి తరువాయి

నుంచి పెద్ద ఎత్తున ఊరట లభించింది. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఖైదులో ఉన్న వీరిని ఏకాంత నిర్బంధంలో ఉంచరాదని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఖాదిమ్ హుస్సేన్ సోమ్రో నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలను ఏకాంత నిర్బంధంలో ఉంచుతున్నారంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది.

### కోర్టు తీర్పులోని ప్రధానాంశాలు:

ఏకాంత నిర్బంధానికి స్వస్తి: ఇమ్రాన్ ఖాన్ దంపతులను ఒంటరిగా ఉంచే పద్ధతికి స్వస్తి పలికి, జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలి. ఇమ్రాన్, బుష్రా సమావేశం అయ్యేందుకు అవకాశం కల్పించాలి. సకాలంలో కుటుంబసభ్యుల భేటీలు: జైలు నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలి. ఆయన కుమారులతో ఫోన్లో



మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. పుస్తకాలు, పత్రికలు, వైద్యం: ప్రతిరోజూ క్రమం తప్పకుండా వార్తాపత్రికలు, పుస్తకాలు అందజేయడంతో పాటు, జైలు నిబంధనలకు అనుగుణంగా సరైన వైద్య సదుపాయాలు కల్పించాలి. ఈ ఆదేశాల అమలుపై పూర్తి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అవినీతి కేసుల్లో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు జైల్లో సరైన వసతులు కల్పించడం లేదంటూ ఆయన కుటుంబ సభ్యులు కొద్దికాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో... హైకోర్టు నుంచి ఈ సానుకూల తీర్పు వెలువడటం గమనార్హం.

## తెల్ల బంగారానికి గండాలెన్నో..


తెలంగాణలో వరి తర్వాత అత్యంత ప్రాధాన్యం ఉన్న వాణిజ్య పంటల్లో పత్తి ఒకటి. తెల్ల బంగారంగా పేరొందిన పత్తి, నేడు రైతులకు నష్టాల మూలంగా ఆత్మహత్యల చరిత్రగా మారుతోంది. విత్తనం కొనుగోలు దగ్గర మొదలయ్యే కష్టం.. మొలక దశలో వర్షాభావం.. ఎదుగుదలలో చీడపీడలు.. పంట చేతికొచ్చే సమ యంలో అకాల వర్షాలు.. చివరికి మార్కెట్‌లో ధర, కొనుగోలు నిబంధనల రూపంలో మరో గండం.. ఇలా పత్తి రైతును సమస్యలు వరుసగా వెంటాడుతున్నాయి.

### తగ్గుతున్న ఉత్పాదకత..

పత్తి సాగు విస్తీర్ణం పెరిగినా, దిగుబడి అదే స్థాయిలో పెరగక పోవడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో 2025-26 సీజన్‌లో సెప్టెంబర్ 24 నాటికి పత్తి సాగు విస్తీర్ణం సుమారు 45.95 లక్షల ఎకరాలుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నివేదిక పేర్కొంది. ఎకరాకు వచ్చే దిగుబడి, నాణ్యత, సాగు వ్యయం, మార్కెట్ ధర- ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత లేకపోవడమే రైతు నష్టాలకు ప్రధాన కారణం.

### విత్తనం దగ్గరే మొదలయ్యే గండం!

పత్తి సాగులో రైతుకు మొదటి భరోసా నాణ్యమైన విత్తనం. కానీ నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల మొలక శాతం తగ్గితే రైతు మొదటి పెట్టుబడే వృథా అవుతుంది. ఒకసారి విత్తనం విఫలమైతే మళ్లీ విత్తడం అంటే అదనపు ఖర్చు, అదనపు శ్రమ. విత్తనాల నాణ్యతపై కఠిన తనిఖీలు, నకిలీ విత్తనాల సరఫరాపై ఉక్కుపాదం అవసరం. మందులు



కొనుగోలు చేసినా అవి నాణ్యమైనవి కాకపోతే పంట నష్టమే కాకుండా రైతు పెట్టుబడీ నష్టమవుతుంది. అందుకే విత్తనం నుంచి పురుగుమందు వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణను కట్టుదిట్టం చేయాలి.

వాతావరణం మరో సవాల్..

వాతావరణ మార్పులు పత్తి రైతుకు కొత్త పరీక్షలు పెడుతున్నాయి. విత్తే సమయంలో వర్షం లేకపోవడం, ఆ తర్వాత ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడం, పూత-కాయ దశలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం పంట దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల ప్రాంతానికనుగుణంగా వాతావ రణాన్ని తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే, చీడపీడలను తట్టుకునే కొత్త రకాలపై పరిశోధనను వేగవంతం చేయాలి.

కొనుగోలు నిబంధనలు.. మరో గండం!

పంట పండించిన తర్వాత దాన్ని అమ్ముకోవడమే మరో పెద్ద సమస్య. 2025-26 సీజన్‌లో తెలంగాణలో సీసీఐ ఎకరాకు ఏడు క్వింటాళ్ల కొనుగోలు పరిమితి విధించడం రైతుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. గతంలో ఉన్న పరిమితితో పోలిస్తే ఇది తగ్గడంతో, అదనపు పత్తిని ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. అదే సమయంలో తేమ శాతం నిబంధనలు కూడా రైతులకు ఇబ్బం దిగా మారాయి. వర్షాల కారణంగా పత్తిలో తేమ పెరిగినప్పుడు నా ణ్యత ప్రమాణాల పేరుతో కొనుగోలు నిరాకరించకుండా, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతుకు న్యాయం చేయాలి.

పత్తి రైతుకు భరోసా ఎప్పుడు?

అన్నదాత పండించిన పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లిన తర్వాత 'ఇంతే కొంటాం' అని పరిమితులు పెట్టడం కాదు.. పండిన ప్రతి గింజకు న్యాయమైన ధర కల్పించడమే ప్రభుత్వాల బాధ్యత. రైతు నష్టపోతే కేవలం ఒక కుటుంబం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థ, వస్త్ర పరిశ్రమ, గ్రామీణ జీవనాధారం కూడా ప్రభావితమవుతాయి. 'విత్తనాల సంచి మంచిదైతే పంట చేతినిండా వస్తుంది' అన్న పెద్దల మాటను ప్రభుత్వాలు ఆచరణలో నిజం చేయాలి.

## కదిలే బస్సులో అత్యాచారం- కేంద్రం, యూపీ సర్కార్‌లపై రాహుల్ ధ్వజం

**మైనర్ పై సామూహిక అత్యాచారం జరగడం దారుణమని వ్యాఖ్య- ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్న రాహుల్**

ఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని అత్యాచార ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వంపై మంగళవారం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ఘనటపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని పోలీసులకు జవాబుదారితనం ఏమాత్రం లేదని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన నేరాల వలే దీన్ని కూడా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేటర్ నోయిడా నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్లీపర్ బస్సులో, ఒక మైనర్ పై 47 కిలోమీటర్ల మేర సామూహిక అత్యాచారం జరగడం దారుణమన్నారు. ఈ విషయంపై ఢిల్లీ పోలీసులు గానీ, నోయిడా పోలీసులు గానీ కనీస సమాచారం కూడా తెలుసుకోలేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్‌లో తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బస్సు నోయిడా, గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే, ఢిల్లీ రింగ్ రోడ్ ఇలా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాన్ని దాటి ప్రయాణించింది. అయితే, ఏ ఒక్క చెక్ పోస్టు వద్ద కూడా ఆగలేదు. బస్సులో తెరలు కప్పి ఉండటంతో లోపల ఏం జరుగుతుందో ఎవరూ చూడలేకపోయారు. పైగా, నేరస్థులకు యంత్రాంగం పట్ల ఎలాంటి భయం లేదు. 'నిర్భయ' కేసు జరిగి ఇన్ని ఏళ్లు గడిచినా, అలాంటి ఘటనలు పునరావృతమవుతున్నా, బస్సులను తనిఖీ చేయడం, పర్యవేక్షించడం వంటివి ఎందుకు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవస్థను సరిదిద్దేలోపు ఇంకా ఎంతమంది మహిళలు, బాలికలు ఇలాంటి పరిస్థితులను అనుభవించాల్సి ఉంటుంది."



రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

పోలీసుల కథనం ప్రకారం, ఆగస్టు 4 రాత్రి కుటుంబ సభ్యులతో జరిగిన మనస్పర్థల కారణంగా ఓ యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అనంతరం ఆ యువతి, నోయిడాలో ఉంటున్న తన బంధువులను కలిసేందుకు బయలుదేరింది. రాత్రి సమయంలో భారీ వర్షం కురుస్తుండగా, మార్గం తెలియక ఆమె పొరపాటున పరీ చౌక్ వద్ద బస్సు దిగింది. వర్షంలో ఒంటరిగా నిలుచున్న ఆమె అటుగా వస్తున్న ఒక ఖాళీ స్లీపర్ బస్సును ఆపి సహాయం కోరింది. బస్సు డ్రైవర్, కండక్టర్ ఆ బస్సు నోయిడా సెక్టార్ 63 వైపు వెళుతుందని నమ్మించి, ఆమెను బస్సు లోపలికి ఎక్కించుకున్నారు. బస్సు కదలడం ప్రారంభించిన కొద్దిసేపటికే కండక్టర్ సందీప్ మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తర్వాత డ్రైవర్, కండక్టర్ ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రతిఘటించిన ఆమెను చంపేస్తామని తీవ్రంగా బెదిరించారు. ఆ స్లీపర్ బస్సులోని బెర్త్‌లకు కర్టెన్లు ఉండటం వల్ల లోపల జరుగుతున్న దారుణం బయటకు కనిపించలేదని పోలీసులు తెలిపారు. సుమారు 47 కిలోమీటర్ల మేర ప్రయాణించిన తర్వాత, ఢిల్లీలోని కాశ్మీరీ గేట్ బస్ టెర్మినల్ సమీపంలోని రింగ్ రోడ్ వద్ద అర్ధరాత్రి సమయంలో బాధితురాలిని బస్సు నుంచి దించేసి నిందితులు పరారయ్యారు. దర్యాప్తు అధికారుల ప్రకారం, సాంకేతిక లోపం తలెత్తడంతో మరమ్మతుల కోసం బస్సును గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లో ఉన్న వర్క్‌షాప్‌కు తీసుకెళ్లారు. మరమ్మతుల అనంతరం ఇద్దరు నిందితులు సాయంత్రం 5 గంటల సమయంలో వర్క్‌షాప్ నుంచి బస్సును తీసుకుని బయలుదేరారు. సూరజ్‌పూర్ నుంచి పారి చౌక్‌కు వెళ్లారు. అక్కడ లిఫ్ట్ ఇస్తామనే నెపంతో యువతిని బస్సు ఎక్కించుకుని కాశ్మీరీ గేట్ వైపు బయలుదేరారు. మార్గమధ్యలో వారు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

# గురునాథ్ స్వామిని అరెస్టు చేయాలి

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : భూకబ్జాలు, మహిళలపైన లైంగిక వేధింపులకు పాల్పడుతున్న గవి మఠం స్వామి గురునాథ్ స్వామిపై విచారణ చేసి అరెస్ట్ చేయాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అశ్వర్థ, విద్యార్థి జేఏసీ అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. వజ్రకరూరు మండలం, కొనగాండ్ల గ్రామంలో ఆసరా తీసుకొని భక్తి ముసుగులో భూ అక్రమాలు, అమాయక మహిళల పైన అత్యాచారాలు, దౌర్జన్యాలు చేసుకుంటూ మరొక డేరా బాబుగా మారాలని విమర్శించారు. గుంతకల్లు మండలంల తిమ్మాపురం గ్రామంలో సర్వేనెంబర్ 63లో 9 ఎకరాల బిసి సామాజిక వర్గానికి చెందిన మాధవరావు కుటుంబానికి భూమిని అక్రమంగా కంచె వేసి తన స్వాధీనం పెట్టుకున్నారని ఆరోపించారు. తహసిల్దార్, సీఎంపేజీ ఆర్స్, ఎండోమెంట్ ఇచ్చిన గురునాథ్‌స్వామి తన పలుకుబడి ఉపయోగించుకొని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ అంశంపై గుంతకల్ డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని తెలిపారు. ఎక్కడబడితే అక్కడ భూ కబ్జాలకు, లైంగిక వేధింపులకు పాల్పడుతున్న గురునాథ్‌స్వామి అనుచరులను అరెస్ట్ చేసి జిల్లా నుంచి బహిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురునాథ్ స్వామి ఆధీనంలో ఉన్న భారత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గురునాథ్‌స్వామి నుంచి విద్యార్థులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో




ఎమ్మార్పీఎస్ జిన్నె చిరంజీవి, లాయర్ వేణుగోపాల్, నరేష్, వంశీ, రాహుల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్నదానం.. అవగాహన

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి ఆధ్వర్యంలో కోవూరునగర్‌లో ఉన్న



ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో విద్యార్థులకు ఒక బియ్యం ప్యాకెట్, అన్నదానంతో పాటు అవగాహన కల్పించారు. మంగళవారం శ్రీస్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో ట్రస్ట్ సభ్యులు కీర్తిశేషులు ఆదినారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా.. వారి సతీమణి లక్ష్మీ నారాయణమ్మ, వారి కుమారులు జనార్దన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కుమార్తె ప్రభావతమ్మ, మనవడు తేజస్ రెడ్డి వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం సాకారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని చదువులో కొనసాగించాలన్నారు. చదువులో విజయం సాధించగలిగితే భవిష్యత్తులో జీవితంలోనూ విజయం సాధించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. పెద్దల ఆశీస్సులు ఉంటే జీవితంలో కుటుంబ బాధ్యతలు, జీవన విధానాలు అలవాడుతాయన్నారు. తోటి వారికి సహాయం చేసే గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.35లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : మూడు దశాబ్దాలకు పైగా ఉన్న సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం చూపిస్తూ ముందుకు సాగుతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని 34వ డివిజన్ మారుతి నగర్‌లో ఆయన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. మారుతి నగర్‌లో నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రుద్రంపేట పంచాయతీ విమలా ఫరూక్ నగర్‌లో కూడా ఆయన పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ప్రతి నెల ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. లబ్ధిదారులు పింఛన్ల పంపిణీ పై హర్షం వ్యక్తం చేశారు. ఆలమూరు రోడ్ లోని పీవీకేకే కళాశాల వద్ద 35 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రుద్రంపేట పంచాయతీలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వీటిని ప్రభుత్వంలో ఏరోజు పట్టించుకోలేదన్నారు. అంతే కాకుండా 30 నుంచి 35 ఏళ్ల సమస్యలకు ఈ రెండేళ్లలోనే పరిష్కారం చూపించామన్నారు. ఒక్క రుద్రంపేట పంచాయతీలోనే



సుమారు 25 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతులు కల్పించామన్నారు. వర్షాకాలంలో నడిమి వంకలో భారీగా నీరు చేరడం వలన రుద్రంపేటలో చాలా కాలనీలు నీట మునుగుతున్నాయన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్ కోసం 128 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే ఆ నిధులు మంజూరు అవుతాయన్నారు. పనులు కూడా చేపడతామన్నారు. ఈ రెండేళ్లలోనే 4పంచాయతీల్లో 60 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఎక్కడా రోడ్లు, డ్రైనేజీల సమస్య లేకుండా చేస్తున్నామని వివరించారు. మరోవైపు పింఛన్ల పంపిణీలో ప్రజల నుంచి ఎంతో సంతోషం కనిపిస్తోందని.. అయితే కొత్త పింఛన్లు కావాలని కూడా కొంతమంది అడుగుతున్నారన్నారు. త్వరలోనే మూడు లక్షల పింఛన్లు వస్తాయన్నారు. అర్హులు ఎవరైనా సరే పార్టీలకతీతంగా



పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులని చాలామందికి పింఛన్లు తొలగించారని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందాలని తమకు ఆదేశాలు ఇచ్చారని దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎక్కడ ఏ సమస్య ఉన్నా.. వెంటనే స్పందిస్తున్నారన్నారు. అభివృద్ధిలో ఎమ్మెల్యే దగ్గుపాటి వేగం చూపిస్తున్నారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

# నిరుద్యోగులకు న్యాయం చేయాలి

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : జాబ్ క్యాలెండర్‌లో పోస్టులు పెంచాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కాలేజీ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. అక్కడ




ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నిరుద్యోగ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు టీపీ రామన్న మాట్లాడుతూ.. పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు కేవలం 1,600తో సరిపెట్టకుండా 11,600 పోస్టులతో భారీ పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పోలీస్ శాఖలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం, ఉద్యోగ వయోపరిమితిని పెంచకపోవడం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న గ్రూప్ 2, ఉపాధ్యాయ, లైబ్రరీలో ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుని కేవలం 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే లక్షలాది మంది నిరుద్యోగులకు సరిపోదని, కనీసం 50 వేల పోస్టులతో నూతన్ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించి దశలవారీగా కాకుండా సాధ్యమైనంత ఎక్కువ పోస్టులను జాబ్ క్యాలెండర్‌లో చేర్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో మలోలకు అందజేశారు. ధర్నాలో వీరుకుమార్, నాగభూషణ రెడ్డి, వేణు, రాజన్న, లక్షిపతి నాయక్, రాజు, దుర్గ, అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

# విద్యుత్ వ్యవస్థ బలోపేతం ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : అనంతపురం నగరంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆయన తిరుపతిలో ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ ఎల్.శివ శంకర్‌ను ఆయన కలిశారు. అనంతపురం ఉన్న సమస్యలు, అవసరాల గురించి సీఎండీకి వినతి పత్రం అందజేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నగర విస-రణ, పెరుగుతున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ డిమాండ్‌ను దృష్ట్యా నూతన సబ్ స్టేషన్లను మంజూరు చేయాలని కోరారు. నారాయణపురం పంచాయతీ, రుద్రంపేట, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల అవసరం ఉందన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓవర్‌లోడింగ్, వోల్టేజ్ హెచ్చుతగ్గులు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 160



కేవీఏ సామర్థ్యం కలిగిన 20 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, పాత విద్యుత్ స్తంభాలు, కేబుళ్లు, పాత లైన్ల స్థానంలో కొత్త లైనింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన మౌలిక వసతుల కల్పనకు అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు పరిపాలనా అనుమతి త్వరితగతిన మంజూరు చేయాలని సీఎండీని కోరారు. అనంతపురం నగర ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారు. అన్ని అంశాలు పరిశీలించి.. అనంతపురం ఎసఈకి తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. అనంతపురం అభివృద్ధిలో భాగంగా విద్యుత్ వ్యవస్థ చాలా ముఖ్యమైందన్నారు. ఇక్కడ జనాభా పెరగడమే కాకుండా పారిశ్రామికంగా కూడా విద్యుత్ అవసరం చాలా పెరిగిందన్నారు. అందుకే పెరిగిన అవసరాల దృష్ట్యా అవసరమైన వాటిని మంజూరు చేయాలని సీఎండీ కోరామన్నారు. త్వరలోనే అవి మంజూరవుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# పేరూరు ప్రాజెక్టుకు వెలుగులు, భద్రత కోసం సీసీ కెమెరాలు

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య :పేరూరు ప్రాజెక్టు నూతన శోభ సంతకరించుకుంది. గత ఐదేళ్లుగా నిర్వహణ, సంరక్షణ లేక అధ్వాన్న స్థితిలో ఉన్న ఆనకట్ట మరియు స్పిల్ వే పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. రూ.35లక్షల రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధులతో ఎలక్ట్రికల్ లైట్స్, ఫ్లడ్ లైట్స్, సి.సి. కెమెరాలను ఏర్పాటు చేయించారు. మంగళవారం సాయంత్రం వీటిని స్థానిక టీడీపీ నాయకులు, అధికారుల సమక్షంలో ప్రారంభించారు.



అనంతరం ప్రాజెక్టుపై నడుస్తూ విద్యుత్ లైట్లను, సీసీ కెమెరాలను పరిశీలించారు. అంతకుమందు రామగిరి మండలం దుబ్బార్లపల్లి సమీపంలో 50.075 కిలోమీటర్ వద్ద జరుగుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పనులు ఎంత వరకు వచ్చాయి, నాణ్యత ఎలా ఉందన్న విషయాలను ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు. పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించాలని 804కోట్లతో పనులు మొదలు పెట్టామన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అడుగు కూడా పని చేయలేదన్నారు. భూమిలిచ్చిన రైతులకు కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. భూగర్భజలాలు కూడా పూర్తిగా అడుగంటాయన్నారు. వారు చేసిన పాపం వలనే ఇంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అయితే మళ్లీ అధికారంలోకి రాగానే పనులు పునఃప్రారంభించామన్నారు. పేరూరు ప్రాజెక్టుపై గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, యంత్రాలను కొందరు ధ్వంసం చేస్తున్నారన్నారు. దీనిని అదుపు చేయాలని గతంలో చాలా ప్రయత్నాలు చేశామన్నారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. అందుకే వీటిని కంట్రోల్ చేయడానికి ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డ్యాంపై ఎవరైనా ఇష్టమొచ్చిన చేస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. అంతే కాకుండా పేరూరు జలాశయాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేలా ఇవాళ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్ లో ప్రాజెక్టుకు నీరందించడమే కాకుండా దీనిని పర్యాటక ప్రాంతంగా మారుస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి దూసుకెళ్తోంది

అనంతపురం సెప్టెంబర్ 1 అనంత సూర్య : కూటమి పాలనలో సంక్షేమం,అభివృద్ధి దూసుకెళ్తోందని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల స-ునీత అన్నారు. రాప్తాడు మండల కేంద్రంలో ఆమె పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ ఆమె పింఛన్లను అందజేశారు. పక్షావాతంతో మంచానికి పరిమితమైన వారికి 15వేలు, వివిధ సమస్యలు ఉన్నవారికి 6వేలు పింఛన్లు అందజేసి.. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం లేకపోతే.. మేము ఇలా ఉండే వారం కాదని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సునీతకు ఆప్యాయంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో పాడి రైతులకు 50శాతం సబ్సిడీతో మంజూరైన పశువుల దానాను అందజేశారు. రాప్తాడు, గంగులకుంట, రామినేపల్లి గ్రామాలకు చెందిన వారికి.. ఒక రైతుకు 11వందల రూపాయలు విలువ చేసే దానాను 50శాతం సబ్సిడీతో పంపిణీ చేశారు. ఆ తర్వాత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భంగా తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, పరిటాల రవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కక్కలపల్లి టమోటా




మండీల నిర్వాహకుల సహకారంతో, పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాప్తాడు మండలానికి చెందిన 20మంది చిరు వ్యాపారులకు 3లక్షల రూపాయల విలువైన, 20తోపుడు బండ్లను అందజేశారు. ఈకార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోయపాటి సుధాకర్, ఉపాధ్యక్షుడు గంగులకుంట కృష్ణ, కన్వీనర్ కొండప్ప, పార్లమెంట్, నియోజకవర్గ కమిటీల సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో తోపుడుబండ్లు లేక చిరు వ్యాపారులు రోడ్డు పక్కన ఒక చోట కూర్చొని విక్రయించుకునే వారన్నారు. ఇప్పుడు ఈ బండ్లు రావడం వలన అన్ని ప్రాంతాలకు తిరుగుతూ చిరు వ్యాపారాలు చేసుకోవచ్చున్నారు. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలను పరిటాల ట్రస్ట్ ద్వారా చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందుతున్నాయన్నారు. పింఛన్లు అందుకుంటున్న వారు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నవారికి 15వేలు, వికలాంగుల పింఛన్ 6వేలు వస్తోందన్నారు. అనారోగ్యంతో మంచాన పడినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే సాయం వారిని ఆదుకుంటోందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా మేము పని చేస్తున్నామన్నారు. పండమేరు వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టామని.. ఇప్పుడు ఇక్కడ బ్రిడ్జి కూడా నిర్మిస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

## ప్రజలకు ఏ అవసరం ఉన్నా.. పరిటాల ట్రస్ట్ సాయం చేస్తుంది

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : ప్రజలకు ఎక్కడ ఏ కష్టం ఉన్నా.. పరిటాల ట్రస్ట్ ద్వారా వీలైనంత సాయం చేస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని సర్వజనాసుపత్రికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా స్ట్రెచ్చర్లు అందజేశారు. మంగళవారం సాయంత్రం శ్రీరామ్ స్వయంగా ప్రభుత్వాసుపత్రికి వచ్చి వీటిని సూపరింటెండెంట్‌తో పాటు ఇతర వైద్యాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోషియేషన్ నాయకుడు నరేంద్ర, ఆలంబన జనార్ధన, డిస్కవరీ అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని సర్వజనాసుపత్రిలో రోగుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లా నలుమూలల ఎక్కడ ఏం జరిగినా, ఎవరికి అనారోగ్యమైనా ఇక్కడికి వస్తారన్నారు. ఇలాంటి సమయంలో అవసరమైన వైద్య సదు-పాయలు కల్పించడం కూడా కష్టంగా మారిందన్నారు. స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధుల సాయంతో కొన్ని సమకూరుస్తున్నారన్నారు. ఆలంబన జనార్ధన, డిస్కవరి అనిల్ లాంటి వారు దాతల సాయంతో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే లింగా నరేంద్ర చౌదరి కూడా ముందుకు వచ్చి ఆసుపత్రికి పరిటాల ట్రస్ట్ ద్వారా స్ట్రెచ్చర్లు అందజేశారన్నారు. ఇవే కాకుండా గతంలో ఉచిత వివాహాలు, రక్తదాన శిబిరాలు వంటివి ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు ఎక్కడ కష్టం వచ్చిన తాము వీలైనంత సాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటామని శ్రీరామ్ చెప్పారు.




# వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత సూర్య : ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటేనని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ తెలిపారు. మంగళవారం నగరంలోని 19, 27, 28, 29 డివిజన్లలోని 30, 31, 36, 37, 38, 39 సచివాలయాల పరిధిలో ఉన్న యువజన విభాగం నేతలు, వైసీపీ నాయకులతో సాయినగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి పేరుతో మాయ-మాటలు చెప్పి 26 నెలలుగా మోసం చేస్తున్నారన్నారు.



గతంలోనూ ఇంటికో ఉద్యోగం పేరుతో మోసం చేశారని గుర్తు చేశారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాల్లో కోతలు తప్పితే ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా యువజన విభాగం కీలకంగా పనిచేయాలని సూచించారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. త్వరలోనే కార్యకర్తలందరికీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఐడీ కార్డులను పంపిణీ ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు మోసాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కన్వీనర్ అనుదీప్ రెడ్డి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదా ఖలందర్, నగర ఉపాధ్యక్షుడు వినీత్, జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు , 28 వ డివిజన్ కన్వీనర్ రవి , సోషల్ మీడియా విభాగం నగర ఉపాధ్యక్షుడు అబ్బాస్ , మైనార్టీ విభాగం కార్యదర్శి షేక్ జావీద్ , సోషల్ మీడియా విభాగం టౌన్ సెక్రటరీ మనోజ్ , ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

# ఔషధ మొక్కలతో మెరుగైన ఆరోగ్యం

## - సిఈఓ ఆవుల చంద్రశేఖర్



తిరుపతి, సెప్టెంబర్ 1 అనంత సూర్య : విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా ప్రభుత్వాలు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాయని ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (ఏపీఎంఏపీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషణ్ వాటిక కార్యక్రమం మంచి ఫలితాలను అందిస్తోందన్నారు. వంటిల్లు మొదలు అంగన్వాడీ కేంద్రాలు, విద్యాలయాల ప్రాంగణాల్లో ఔషధ మొక్కల వినియోగంతో మరింత మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. తిరుపతి జిల్లా ఓజిలి మండలం, వాకాటివారి కండ్రిగ గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఆయన మంగళవారం పర్యటించారు. ప్రిన్సిపాల్ పవన్ కుమార్ సింగ్ అధ్యక్షతన, ఔషధ మొక్కలు, సుగంధద్రవ్యాల గురించి గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఈఓ ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యాలయాల ప్రాంగణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇళ్లవద్ద సేంద్రియపద్ధతిలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలను పెంచే ఒక చిన్నతోట ఎంతో మార్పును తీసుకొస్తున్నదన్నారు. ఓజిలి మండలంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించడం తనకు ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో పోషకాహార, ఔషధ మొక్కల పెంపకానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, సమగ్ర వికాసానికి తోడ్పడుతోందని సిఈఓ ఆవుల చంద్రశేఖర్ ప్రశంసించారు. ఈ పాఠశాల సీబీఎస్ఈ గుర్తింపు పొంది, 6 నుండి 12వ తరగతి వరకు విద్యను అందిస్తోందన్నారు. ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ క్యాంపస్, విద్యార్థుల వసతి, విద్యకు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో పోషణ్ వాటిక ద్వారా తాజా పోషకాహారం, స్థానికంగా పండించిన తాజా, రసాయన రహిత (ఆర్గానిక్) కూరగాయలు, పండ్లు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలు, పిల్లల్లో విటమిన్లు, ఖనిజ లవణాల లోపాన్ని తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. సేంద్రియ పద్ధతులతో, ప్రకృతి సిద్ధమైన ఎరువులతో, తక్కువ ఖర్చుతో కూడిన తోటపనిని ప్రోత్సహిస్తాయన్నారు. తాజా ఆహారం కోసం బయటి మార్కెట్‌పై ఆధారపడకుండా, స్థానిక సమాజాలను స్వయంసమృద్ధిగా మారుస్తాయన్నారు. ఔషధ మొక్కలు పెరిగి పోషణతో పాటు, ఆరోగ్యాన్ని పెంపొందించేలా, మూలికలైన తులసి, అలోవెరా, వంటివాటిని పెంచుతారన్నారు. ఈ చొరవ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సిఈఓకు ఘన సత్కారం : లండన్ మహానగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్ లో ఇటీవల వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి అంతర్జాతీయ అవార్డు అందుకున్న సిఈవో ఆవుల చంద్రశేఖర్ ను పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఏపీ ఉప సిఈఓ ప్రదీప్, అటవీశాఖ సెక్షన్ అధికారి శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, ఎన్జీఓ ప్రతినిధి మధుసూదన్ రెడ్డి, సాంకేతిక సహాయకుడు ప్రసాద్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ పవన్ కుమార్ సింగ్, పిజిటి అన్వర్, టిజిటి అంగద్ కుమార్ సింగ్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళల్లో కొనసాగుతున్న ఆపరేషన్ నైట్ సేఫ్టీ

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 1 అనంత సూర్య : జిల్లా ఎస్పీ జగదీష్



ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ కొనసాగుతోన్న పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వేళల్లో అనంతపురం నగరంతోపాటు మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలలోని ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లపై జులాయిగా తిరిగే వారిపై నిఘా వేశారు. రాత్రివేళ తమ అవసరాల నిమిత్తం తిరగాడే ప్రజలు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఫుట్ పెట్రోలింగ్‌తో పాటు విస్తృతంగా తనిఖీలు కొనసాగించారు. మద్యం సేవించి రోడ్లపై ద్విచక్ర వాహనాలతో రాష్ డ్రైవింగ్ చేయడం, హారన్లు కొడుతూ ప్రజలను ఇబ్బంది పెట్టడం, ప్రధాన కూడళ్లలో వాహనాలను నిలిపి గుంపులుగా, అనుమానస్పదంగా తిరుగకుండా ఆయా పోలీసులు చెక్ పెట్టారు.

# ఎల్.నినో విపత్తు సమయంలో తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత










- కేంద్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు జూలై 31, 2027 వరకు సరిపడా తాగునీటిని నిల్వ చేసుకోవాలి
- సాగుకు నీరు ఇవ్వడంపై చాలా కసరత్తు చేశాం.. రెండు నెలల కిందటే ఆరుతడి పంటలు వేయండని చెప్పాం
- విపత్కర పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి, మిర్చి వేయొద్దని సూచన.. క్లిష్ట పరిస్థితుల్లో అందరూ సహకరించాలి
- నవంబర్ 10 వరకు టీబీ డ్యాం నీరు వచ్చేలా అధికారులు ప్లాన్ చేయండి
- రాబోయే 80 రోజుల నీటి వినియోగ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలి
- ఈ రోజు నుంచే ఆరుతడి పంటలకు హెచఎలఎంసీ, జీబీసీ కింద నీరు విడుదల చేస్తున్నాం
- తుంగభద్ర డ్యాంకి ఉన్న 33 గేట్లు ఒకేసారి మార్చాం.. అది అల్ ఇండియా రికార్డు..
- సాగునీటి సలహా మండలి సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, సెప్టెంబర్ 1 (అనంత సూర్య):లిలి ఎల్‌నినో ప్రభావంతో రానున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 31, 2027 వరకు సరిపడా తాగునీటిని నిల్వ చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయకుండా ఆరుతడి పంటలను ఎంచుకోవాలని కోరారు. రైతులకు ముందుగానే పరిస్థితులపై అవగాహన కల్పించాలని సూచించారు. నవంబర్ 10 వరకు తుంగభద్ర డ్యాం నుంచి నీరు అందేలా 80 రోజుల నీటి వినియోగ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆరుతడి పంటలకు హెచ్ఎల్‌సీ, జీబీసీ కింద నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి అవసరాలు తీర్చిన తర్వాతే ఇతర అవసరాలకు నీటిని కేటాయించాలని స్పష్టం చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో రైతులు, ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. నీటి వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405